సాక్షి
మహబూబాబాద్

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



పుష్‌పుల్ రైలును కొనసాగించాలి
కాజీపేట- డోర్నకల్, డోర్నకల్-విజయవాడ పుష్‌పుల్ రైలును రద్దు చేయకుండా కొనసాగించాలని స్థానిక ప్రజలు నిరసన తెలిపారు.
- 11లో▸



ప్రమాదశాత్తు ఇల్లు దగ్ధం
ఆమనగల్ గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. సుమారు రూ.1.50 నగదు, ఇంటి సామగ్రి కాలిపోయాయి.
- 11లో▸

గరిష్టం/కనిష్టం
32.5^0 /21.5^0

వాతావరణం
జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వీరభద్రస్వామి ఆలయ ద్వారబంధనం



కురవి: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయం శనివారం ఆలయ ద్వార బంధనం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు.ప్రధాన ఆలయ ద్వారంతోపాటు మండపం, తూర్పు రాజగోపురం తలుపులను మూసివేశారు.తిరిగి ఆదివారం ఉదయం 4.30 గంటలకు సంప్రోక్షణ అనంతరం స్వామి వారి దర్శనం ఉంటుందని ఆలయ ఇఓ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రవి తెలిపారు.

31 నుంచి కేంద్ర బృందం పర్యటన



నెహ్రూసెంటర్: నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ బృందం సభ్యులు ఈనెల 31 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు జిల్లాలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, ఆరోగ్య సబ్ సెంటర్లను పరిశీలించడం జరుగుతుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. అంబరీష అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పీస్, వైద్యాధికారులకు ముందస్తుగా శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. మెటర్నల్ చైల్డ్‌హెల్త్, యూ విన్ యాప్, ఐహెచ్‌ఐపీ, ఈ-సంజీవని, అసంక్రమిత వ్యాధులు,లెప్రసీ,కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు,వ్యాధి నిరోధక టీకాలు,టీబీ ప్రోగ్రాం, ఆల్ నేషనల్ హెల్త్ ప్రోగ్రాంపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు,ప్రోగ్రాం ఆఫీసర్స్, ఎంఎల్‌హెచ్‌పీస్, డీఐఓ డాక్టర్ రాజ్‌కుమార్, డీపీఎం రుక్ముద్దీన్,హెల్త్ ఎడ్యుకేటర్ కేవీరాజు, డీడీఓం సామిత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు లాభదాయకం



కురవి: అధిక సాంద్రత పత్తి సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీనారాయణ, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మాలతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మల్యాల కృషి విజ్ఞా న కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగును పరిశీలించారు. ఈ పద్ధతిలో సాగు చేయు విధానం, పాటించు యాజమాన్యం , దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకే సారి పంటను తెంపుకుని, మరో పంటను సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నరేందర్‌గౌడ్, ఏఓ మంజుఖాన్, ఏఈఓ పున్నమి, రాశీసీడ్స్ టెరటరీ మేనేజర్ పెంతల రాజిరెడ్డి, పీఓ సంతోష్, నూజివీడు సీడ్స్ టైలరింగ్ మేనేజర్ మురళీ, రైతులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన అమెరికన్

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని అమెరికా దేశానికి చెందిన కోన్రాడ్ సోబోల్వెస్కీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి స్టేట్ టూరిస్ట్ గైడ్ వెంకట్ వివరించగా టెంపుల్ బ్యూటిఫుల్‌గా ఉందని కొనియాడారు.

సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ


జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

- 1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు

- వివరాలు 10లో▸

ముగ్గురు రెఢీ

మానుకోటలో రాజకీయ మజా
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఖరారుతో వేడి
- ఇప్పటికే ప్రచారంలో బీఆర్ఎస్, బీజేపీ
- రథం సిద్ధం చేసుకున్న కాంగ్రెస్



సాక్షి, మహబూబాబాద్: ఎన్నికల ప్రచారం వేడెక్కింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖరారు కావడంతో ఎన్నికల మజా వచ్చింది. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీలు ప్రచారంలో ముందుకు వెళ్తుండగా.. రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు కావడంతో నేడు (ఆదివారం) ప్రచారానికి ముహూర్తం పెట్టుకొని అంతా సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో ఇక ముందు మూడు పార్టీల ప్రచారం హోరెత్తనుంది.

ప్రచారంలో బీఆర్ఎస్, బీజేపీ..

ఎన్నికల నోటిఫికేషన్ రాగానే మహబూబాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పేరు ఖరారు చేశారు. దీంతో ఆయన అప్పటి నుంచే ప్రచారం మొదలు పెట్టారు. ఎన్నికల కోడ్‌కు ముందుగానే ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించడం, కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. పనిలో పనిగా ప్రచారం కూడా మొదలు పెట్టారు. అప్పటి నుంచే సొంత పార్టీలోని అసమ్మతి వర్గీయులను బుజ్జగించడం, మరోవైపు గ్రామ గ్రామాన ప్రచారం ముమ్మరం చేశారు. ఇదే ఊపులో ఉన్న బీఆర్ఎస్‌కు శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చి మరింత ఊపు తెచ్చారు. ఎన్నికల కోసం క్యాంపు కార్యాలయం ప్రారంభించి ప్రచారం మరింత ముమ్మరం చేశారు. అదేవిధంగా తనకే సీటు వస్తుందని ఊహించిన బీజేపీ నాయకుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ముందుగానే ప్రచారం మొదలు పెట్టారు. పల్లెపల్లెకు బీజేపీ.. ఇంటింటికి బీజేపీ.. పేరుతో ఆశీర్వాద యాత్రను మొదలుపెట్టారు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాలు, తండాలతోపాటు మహబూబాబాద్ మున్సిపాలిటీని కలియ తిరిగి తనకు ఓటు వేయాలని కోరారు.

ప్రచారానికి సిద్ధమైన కాంగ్రెస్

ప్రతీ ఎన్నికల మాదిరిగానే ఈ సారి కూడా ఇతర పార్టీల కన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో ఆలస్యం చేసింది. అయితే శుక్రవారం వరకు మహబూబాబాద్ సీటు మురళీ నాయక్‌కు వస్తుందా..? బలరాం నాయక్‌కు వస్తుందా.. అన్న మీమాంసలో ఉంది. శుక్రవారం ఎట్టకేలకు మురళీ నాయక్ పేరు ఖరారు కావడంతో ఇతర పార్టీలకు పోటీగా ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ కూడా ఆయుధాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే ప్రచార రథం సిద్ధం చేసుకొని విజయ దశమి రోజు పూజలు కూడా నిర్వహించారు. మురళీ నాయక్ బీఫాం తీసుకొని మహబూబాబాద్ రాకుండానే.. ప్రచారం షెడ్యూల్ ఖరారు చేశారు. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డితోపాటు, మురళీ నాయక్ అనుచరులు, పార్టీ శ్రేణుల ద్వారా అన్ని మండలాలకు ప్రచారం షెడ్యూల్ పంపించారు. ఇలా ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి శంకర్ నాయక్, బీజేపీ అభ్యర్థి హుస్సేన్ నాయక్‌లు గత ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవంతో ముందుకు వెళ్తుండగా.. మురళీ నాయక్ మాత్రం ఇప్పటి వరకు మహబూబాబాద్ మున్సిపాలిటీ మినహా ఇతర ప్రాంతాల్లో ప్రచారం చేయలేదు. ఇందుకోసం గతంలో పోటీ చేసిన భరత్‌చంద్రారెడ్డి, ఇతర నాయకుల సూచనలు, సలహాలతో ముందుకు వెళ్లేందుకు సిద్ధం అయ్యారు. ఏది ఏమైనా మూడు పార్టీలు ఎన్నికల్లో విజయం సాధించడమే ధ్యేయంగా ముందుకు వెళ్లడంతో ఎన్నికల ప్రచారం మరింత వేడెక్కింది.

గిరిజనులకు క్షమాపణ చెప్పాలి

- మంత్రి సత్యవతి రాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

మహబూబాబాద్: గిరిజనులకు వెయ్యిరూపాయలు ఇచ్చి గుడుంబా పోయిస్తే ఓట్లు వేస్తారని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, మాజీ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడడం సబబు కాదని, గిరిజన జాతికి వారు క్షమాపణ చెప్పాలని మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ నివాస గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

గిరిజనులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ అని కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే ఉపయోగించుకుందన్నారు. గిరిజనులను మోసం చేసిన కాంగ్రెస్‌ను రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే బానోత్‌శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌మహ్మద్‌ఫరీద్, నాయకులు మూల మధుకర్‌రెడ్డి, సుదగాని మురళి, రాజు, చిట్యాల జనార్దన్, రఘు, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారు

గార్ల: ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఇల్లందు మార్కెట్ చైర్మన్ బానోత్ హరిసింగ్ నాయక్, దిండిగల రాజేందర్, శివాజీచౌహాన్, మూల మధుకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జడ్జి

మరిపెడ: విద్యార్థి దశ నుంచే న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూర్ సివిల్ జడ్జి మట్ట సరిత అన్నారు. మరిపెడలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం న్యాయవ్యవస్థపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ర్యాగింగ్ చేయడం తోటి విద్యార్థులను మానసికంగా వేధించడం నేరంగా పరిగణించబడుతుందన్నారు. విద్యార్థులు తప్పులు చేస్తే అవి శిక్షకు దారితీసే అవకాశం ఉంటుందని,విద్యార్థులు సరైన మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోతు లాలు, ఎస్సై పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని తొర్రూర్ జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత అన్నారు. మండలకేంద్రంలోగల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అమ్మఒడి అనాథాశ్రమంలో వృద్ధులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మైలపాక అశోక్, ఎస్సై రమేష్‌బాబు, న్యాయవాదులు కృపావతి, విజయ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు/నర్సింహులపేట: చిన్నగూడూరు మండల కేంద్రంతో పాటు జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించారు. అలాగే నర్సింహులపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, న్యాయవాదులు లాలు, ఎస్సై సంతోష్‌కుమార్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్షణకు హాజరు కావాలి

- కలెక్టర్ కె.శశాంక



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ఎన్నికల శిక్షణా తరగతులకు విధులను కేటాయించిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ కె. శశాంక ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల శిక్షణ తరగతుల నిర్వాహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కార్యకలాపాల పర్యవేక్షణ

కలెక్టరేట్ కార్యాలయంలోని ఎలక్షన్ కార్యకలాపాల విభాగాన్ని కలెక్టర్ కె. శశాంక సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కాల్ సెంటర్ సి విజిల్, సోషల్ మీడియా, మీడియా ధ్రువీకరణ మానిటరింగ్ కమిటీల నిర్వాహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24/7 ఈ విభాగాలు పని చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, అధికారులు ఉన్నారు.

ఈతకు వెళ్లి బావబామ్మర్దుల మృతి



పిల్లల మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

నర్సింహులపేట: దసరా పండుగకు అమ్మమ్మ ఇంటికి వచ్చి ఒకరు, అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి మరొకరు సరదాగా ఈతకు వెళ్లి వాగులో మునిగి చనిపోయారు. మృతులిద్దరు విద్యార్థులు. వరుసకు బావబామ్మర్దులు. ఈ ఘటన నర్సింహులపేట మండలం జయపురం శివారు బక్కతండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బక్కతండాకు చెందిన గుగులోతు పోట్యా, కవిత దంపతుల కుమారుడు సతీష్ (17) దసరా సెలవులకు అమ్మమ్మ ఇంటికి (మానుకోట మండలంలోని బంజరతండా) వెళ్లి శుక్రవారమే వచ్చాడు. పోట్యా సోదరి సరోజ కుమారుడైన కార్తీక్ (16) సెలవుల్లో అమ్మమ్మ ఊరైన బక్కతండాకు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పోట్యా వ్యవసాయ పొలం వద్ద ఉండగా భోజనం ఇవ్వడానికి సతీష్, కార్తీక్‌లు వెళ్లారు. బాక్స్ ఇచ్చి బైక్‌పై తిరిగి వస్తుండగా ఆకేరు వాగులో స్నానం చేయడానికి ఆగారు. వాగులో మొదటగా ఈత రాని కార్తీక్ దిగడంతో ఒక్కసారిగా ఇసుకలో జారి లోతైన గుంతలోకి వెళ్లాడు. అతన్ని కాపాడేందుకు సతీష్ వాగులోకి దిగాడు. ఈత రాని కార్తీక్ భయంతో సతీష్‌ను గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ మునిగి చనిపోయారు. సాయంత్రం వరకు ఇద్దరు పిల్లలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, తండావాసులు వెతకడం ప్రారంభించారు. వాగు వద్ద దుస్తులు, బైక్ ఉన్నట్లు గమనించి శుక్రవారం అర్ధరాత్రి వరకు వాగులో వెతికారు. పోలీసులు కూడా ఘటనస్థలికి చేరుకున్నారు. శనివారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో మృతదేహాలను బయటికి తీశారు.



సతీష్, కార్తీక్ (ఫైల్)

కార్తీక్, సతీష్‌లు చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు, వరుసకు బావబామ్మర్దులు. ఈతకు వెళ్లి చనిపోవడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వీరి తల్లిదండ్రులకు కూడా వీరు ఒక్కరే కుమారులు. సతీష్ తొర్రూర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతుండగా, కార్తీక్ పాల్వంచలో 9వ తరగతి చదువుతున్నాడు. గుగులోతు పోట్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు.

గురుకుల మహిళా కళాశాలలో రెండు పీజీ కోర్సులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాలలో (వరంగల్ వెస్ట్) ఈవిద్యాసంవత్సరం (2023-24)లో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎంఏ పొలిటికల్ సైన్స్ పీజీ కోర్సులు ప్రవేశపెడుతూ.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, కాకతీయ యూనివర్సిటీ కూడా అనుమతినిచ్చిందని ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.దయాకర్ తెలిపారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈమూడో దశలో ఆయా పీజీ అడ్మిషన్లలో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని విద్యార్థులను కోరారు. కాస్మోటిక్ చార్జెస్, ఫిజికల్ ఫిట్‌నెస్ జిమ్, లైబ్రరీ సౌకర్యం కూడా ఉందన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

గార్ల: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గార్ల వేట వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం మండలంలోని మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని వైభవంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి, సమేత శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ప్రతిష్ఠించి మేళతాళాలతో ఊరేగిస్తూ, ఎదుర్కోళ్లు నిర్వహించి, ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ మండపం వద్దకు తోడ్కొని వచ్చి, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం నిర్వహించారు. స్వామివారి తలంబ్రాలను డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామం నుంచి మల్లం గోపయ్య, మల్లం నర్సయ్య వంశస్తులు తీసుకురాగా, అన్నం అనిల్ పూజిత, సముద్రాల శేషాచార్యులు జోష్నాదేవి, టి.తరుణ్ అభిజ్ఞ, వై.శ్రీనివాస్‌స్వామి వసుంధర దంపతులు పీటలపై కూర్చోగా, కల్యాణ తంతును అర్చకులు కండ్లకుంట్ల వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాయణం రాముస్వామి, రామాయణం మధుస్వామి, అచ్యుత్‌స్వామి, యాదగిరిస్వామిలు ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి జిల్లాకు చెందిన భక్తులతో పాటు ఖమ్మం, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు తిలకించి భక్తి పారవశ్యం పొందారు. పరుచూరి కుటుంబరావు దంపతులు భక్తులకు లడ్డూ ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. ఎస్సై బానోత్ వెంకన్న పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కల్యాణ మహోత్సవంలో మంత్రి సత్యవతిరాథోడ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఇల్లందు మార్కెట్ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్, మర్రిగూడెం, గార్ల సర్పంచ్‌లు భూక్యా బుజ్జి రాములు, అజ్మీర బన్సీలాల్, ఆలయ కమిటీ చైర్మన్ బి.అమర్‌చంద్, ఆలయ ఈఓ నందనం కవిత, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి భూక్యా కస్నానాయక్, రావూరి వెంకట్రామయ్య, పుల్లఖండం రమేష్‌బాబు, భూక్యా హరి, జితేందర్ అగర్వాల్, ఎం.రాములు, పి.శ్రీనివాస్‌గుప్తా, పి.వేణుగోపాల్, అత్తులూరి సత్యం, వేమిశెట్టి శ్రీనివాస్, బాదావత్ చంటి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తజన సందడి



హేమాచల క్షేత్రంలో హారతి తీసుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల క్షేత్రంలో స్వయంభువుగా వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం పాక్షిక చంద్రగ్రహణం ఉండడంతో సాయంత్రం 5గంటలకు ఆలయాన్ని మూసివేశారు. ఆదివారం ఉదయం 9గంటలకు సంప్రోక్షణ చేసిన అనంతరం యథావిధిగా భక్తులు దర్శనం చేసుకోవచ్చని అర్చకులు తెలిపారు. చంద్రగ్రహణానికి ముందుగా స్వామివారని దర్శించుకునేందుకు పలువురు రాజకీయ ప్రముకులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిల తైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గంటల కొద్ది వేచి ఉండి మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ ఆచార్యులు భక్తులకు స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని వివరించడాన్ని ఎంతో శ్రద్ధతో ఆలకించి పరవశించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



సమీక్షలో పాల్గొన్న ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పాటిల్, అధికారులు

మహబూబాబాద్ రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ హైదరాబాద్ డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పాటిల్ మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి హాజరై సమీక్షలో పాల్గొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం దీర్ఘకాలిక పెండింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర అంశాల గురించి చర్చించారు. ఈ సమీక్షలో జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, టౌన్ డీఎస్పీ సత్యనారాయణ, తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వర బాబు, సీసీఎస్ డీఎస్పీ మోహన్, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ బాలాజీవరప్రసాద్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కురవి: కురవి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రాం సింగ్ జీ పాటిల్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్

మహబూబాబాద్ అర్బన్: కస్తూరిబా పాఠశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మన్నకాలనీలో గల కేజీబీవీ పాఠశాలను శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్, సబ్ జడ్జి సి.సురేష్, జూనియర్ సివిల్ జడ్జి పి.మౌనిక, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను, వంట గదులను, తరగతి గదులను, మంచినీటి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధా న న్యాయమూర్తి మాట్లాడుతూ.. పాఠశాలలను దేవాలయాలుగా పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్య త పాఠశాల సిబ్బందిపై ఉందన్నారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రంగా ఉన్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండి చదువులో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, జీసీడీఓ విజయకుమారీ, స్పెషల్ ఆఫీసర్ భవాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ బలాలు, బలహీనతలు నాయకులకు తెలుసు. మంచినాయకుడు బలహీనతలు వదిలేస్తాడు. బలాలను పెంచు కుంటాడు.
- వారెన్‌బెన్నిస్



ఈసీ టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు



జనగామ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 1950 కాల్ సెంటర్

జనగామ: ఓటర్ల వ్యక్తిగత సమాచారం, పోల్ సంబంధిత ఫిర్యాదులు, ఇతర సమస్యలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎలక్షన్ కమిషన్ టోల్ ఫ్రీ నంబర్–1950 అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామాల వారీగా పోలింగ్ స్టేషన్లు, బూత్‌లెవల్ అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సంబంధించిన వివరాలు హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఓటు.. వజ్రాయుధం



ఓటు హక్కు వినియోగంపై శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హనుమకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.
- హన్మకొండ

జంగ్ తెలంగాణ

ప్రచారంలో 'పరీక్ష'..



బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ శనివారం కాజీపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఆర్ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా బీపీ పరీక్షించుకున్నారు.

సోషల్ 'వార్'..

తొర్రూరు: ఎన్నికల వేళ టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరిగిపోతోంది. సోషల్ మీడియాలో వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్‌లో పార్టీ ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం ఓటర్లకు విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో నాయకులు వారికి తెలిసిన నంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ఒక పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే అతను ఇష్టం ఉన్నా.. లేకున్నా మొహమాటంతో పోస్టులు చూడలేక, చదవలేక సతమతమవుతున్నాడు. పొరపాటున ఎగ్జిట్ అయితే వారు తమ పార్టీ మనిషి కాదని భావించే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఒకే గ్రూపులోనే పార్టీకి అనుకూలంగా వ్యతిరేకంగా పోస్టులు సెండ్ చేస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఏదీ ఏమైనా ఈ ఎన్నికల సీజన్‌లో వాట్సాప్ లొల్లితో ఓటర్లకు తిప్పలు తప్పడం లేదు.



సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..





సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించాలి

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు కోరారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వాల ముందుంచారు. తమ పెన్షన్ నుంచి నెలకు ఒక్క శాతం చెల్లిస్తామని, తమకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే పెన్షన్ చెల్లించాలని, గత పీఆర్‌సీ, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. చేతనైన సమయంలో జీవితం మొత్తం ఉద్యోగం కోసం వెచ్చించామని, విరమణ చేసి విశ్రాంతి తీసుకున్న తమ సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.
- హన్మకొండ

నగదు రహిత వైద్యం అందడం లేదు



కార్పొరేట్ ఆసుపత్రుల్లో డబ్బు లేకుండా వైద్య అందడం లేదు. హెల్త్ స్కీమ్ ఏర్పాటు చేసి మాకు ప్రతి ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.
- ఎస్ సోమయ్య, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు

కార్పొరేషన్ ఆవరణలో సబ్‌ట్రెజరీ ఆఫీస్ కొనసాగించాలి



నాలుగు సంవత్సరాల క్రితం వరంగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సబ్ ట్రెజరీ ఆఫీస్ ఉండేది. జిల్లాల విభజన తర్వాత హనుమకొండకు మార్చారు. తద్వారా వరంగల్ జిల్లాలోని సుమారు 7వేల మంది పెన్షనర్లం హనుమకొండకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం.
- మహ్మద్ నిజామొద్దీన్, రిటైర్డ్ ఎంఈఓ, సంఘం వరంగల్ సిటీ అధ్యక్షుడు

మొదటి తేదీన పెన్షన్ ఇవ్వాలి



కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి నెల 6 నుంచి 15వ తేదీ మధ్యలో పెన్షన్ అందజేస్తున్నారు. అలాకాకుండా ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కరించి మమ్ములను ఆదుకోవాలి
- ఏ.సత్యనారాయణ, రిటైర్డ్ ఎస్‌టీఓ, సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

సచివాలయంలోకి అనుమతించడం లేదు



మా సమస్యలు వివరిద్దామని రాష్ట్ర సచివాలయానికి వెళ్తే అనుమతించకుండా సీనియర్ సిటిజన్లను అవమానపరుస్తున్నారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయకుండా ప్రభుత్వాలు మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి ధరలు నియంత్రించి సామాన్యులకు ఊరటనివ్వాలి.
- పగడాల సరళ, రిటైర్డ్ ఉద్యోగి

పైరవీ చేసిన వారికే పెండింగ్ బిల్లులు



మా బకాయిల గురించి నిత్యం ట్రెజరీ చుట్టు తిరిగినా రావడం లేదు. పైరవీల ద్వారా వెళ్లిన వారికే వస్తున్నాయి. నేరుగా వెళ్తే పని కావడం లేదు. మా సమస్యలు చెప్పుకోవడానికి జిల్లాల వారీగా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలి. ప్రతీ జిల్లా కేంద్రంలో పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా ట్రెజరీ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలి.
- మంత్రి సతీష్, రిటైర్డ్ ట్రెజరీ అధికారి

పెన్షనర్ల సంఘానికి భవనం నిర్మించి ఇవ్వాలి



రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో పెన్షనర్లు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోసం స్థలం కేటాయించి, భవనం నిర్మించాలి. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలి. వెల్‌నెస్ సెంటర్లలో సీనియర్ డాక్టర్లను నియమించి మందులు కొరత లేకుండా చూడాలి. ఓపీ రిజిస్ట్రేషన్ సమయంలో నెలకొన్న ఇబ్బందులు తొలగించాలి. అలాగే, ప్రతి ఒకటవ తేదీనే పింఛన్ అందజేసి ఆదుకోవాలి.
- సంజీవరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి

రీయింబర్స్‌మెంట్ రావడం లేదు



హెల్త్ స్కీం అమలుకు నోచుకోకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం డబ్బు చెల్లించాల్సి వస్తోంది. వైద్యం పూర్తయ్యాక రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటే సకాలంలో అందక ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బాబేసిక్‌పే నుంచి ఒక్క శాతం కట్ చేసుకుని హెల్త్‌స్కీం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. డీఏ, ఇతర బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి నగదు రూపంలో చెల్లించాలి.
- ఎంఏ జలీల్, రిటైర్డ్ ఉద్యోగి

వెల్‌నెస్ సెంటర్లలో ల్యాబ్ పరీక్షలు చేయాలి



వెల్‌నెస్ సెంటర్లలోని ల్యాబ్‌లో 60 రకాల పరీక్షలు చేస్తామన్నారు. కానీ ఒక్క పరీక్ష కూడా చేయడం లేదు. వ్యాధి తీవ్రత కోసం నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. వైద్యులు కూడా ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ఉంటారో తెలియడం లేదు. అనుభవం కలిగిన డాక్టర్లతో పాటు మందుల కొరత లేకుండా చూడాలి. ల్యాబ్ పరీక్షలు అన్నింటినీ చేసేలా వసతులు కల్పించాలి.
- కె.రాజశేఖరయ్య, రిటైర్డ్ దేవాదాయశాఖ ఉద్యోగి

ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి



రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయ పన్ను నుంచి మినహాంపు ఇవ్వాలి. ఏటా ఆదాయ పన్ను ప్రతిపాదనలు పంపమనడంతో ఇబ్బందులు పడుతున్నాం. రైలులో ప్రయాణించేందుకు గతంలో రాయితీ ఉండేది. దానిని రద్దు చేశారు. ప్రస్తుతం ఆ రాయితీని పునరుద్ధరించాలి. ఉద్యోగులకు జీతాలతో పాటు పెన్షనర్లకు కూడా నెలలో మొదటి తేదీన పింఛన్ ఇవ్వాలి.
- చందుపట్ల నిరంజన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి

డీఏ, పీఆర్‌సీ చెల్లించాలి



ఆరు నెలల్లో మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మాకు రావాల్సిన డీఏ, పీఆర్‌సీని వాయిదాల పద్ధతిలో చెల్లించడం బాధాకరం. మునుపెన్నడూ ఇలా వాయిదాల పద్ధతిలో డీఏలు ఇవ్వలేదు. పెన్షనర్ల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి డీఏ, పీఆర్‌సీ, బకాయి బిల్లులు ఒకే విడతలో చెల్లించాలి. అప్పుడే మా కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి.
- ఇ.శేషయ్య, రిటైర్డ్ ఉద్యోగి

జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు

- 1952లో ఏర్పడిన నియోజకవర్గ ప్రస్థానం ఇదీ..
- ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ
- 50,079 నుంచి 2,20,886 వరకు పెరిగిన ఓటర్లు
- కీలకంగా మారనున్న మహిళా ఓట్లు



చందూలాల్ సీతక్క





వీరయ్య భోజారావు

ములుగు: ములుగు నియోజకవర్గంలో 1952లో తొలిసారి శాసన సభ ఎన్నికలు జరిగాయి. ఇందులో పీడీఎఫ్(పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్) తరఫున హనుమంతరావు, కాంగ్రెస్ తరఫున రాజ్యలక్ష్మీ పోటీ చేశారు. ఇందులో రాజ్యలక్ష్మీకి కేవలం 6,540 ఓట్లు మాత్రమే వచ్చాయి. పీడీఎఫ్ అభ్యర్థి హనుమంతరావుకు 7,132 పోలై ములుగు తొలి ఎమ్మెల్యేగా రికార్డుల్లోకి ఎక్కారు. 1972 వరకు ములుగు జనరల్‌గా ఉంది. ఎస్టీ జనాభా ఎక్కువ ఉండడంతో డిలిమిటేన్‌లో భాగంగా 1978లో ఎస్టీ రిజర్వ్‌గా మారింది.

ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ

ములుగు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీలే ఎక్కువసార్లు గెలుపొందాయి. కాగా టీడీపీ ప్రభుత్వంలో అజ్మీర చందూలాల్, పోరిక జగన్నాయక్ రెండు సార్లు మంత్రులుగా కొనసాగారు. ఇక 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అజ్మీర చందూలాల్.. కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కపై 18,884 ఓట్లతో గెలుపొందారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఏకంగా సిట్టింగ్ మంత్రి చందూలాల్‌పై 22,671 ఓట్లతో గెలుపొందారు.

భారీగా పెరిగిన ఓటర్లు..

1952 మొదలు.. 2023 సంవత్సరం వరకు 71 సంవత్సరాల్లో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. 1952తొలి ఎన్నికల్లో 50,076 మంది ఓటర్లు మాత్రమే ఉండగా 1985లో తొలిసారి 1,09,680 మొదటిసారి లక్ష సంఖ్య దాటింది. 1999లో 1,61,863 వరకు వచ్చింది. ఇక 2014లో రెండు లక్షలు దాటింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,20,886 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రభావం చూపనున్న మహిళా ఓటర్లు

2009 నుంచి ములుగు నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ సాధారణ ఎన్నికల్లో 1,08,588 మంది పురుషులు, 1,12,277 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించనున్నారు. ఈ లెక్కన నియోజకవర్గంలోని 10 మండలాల్లో (మల్లంపల్లి నూతన) 3,089 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు.

2009లో మారిన నియోజకవర్గ ముఖచిత్రం

2009 సాధారణ శాసనసభ ఎన్నికల్లో ఒక్కసారి ములుగు నియోజకవర్గ ముఖచిత్రం పూర్తిగా మారింది. గతంలో నియోజకవర్గంలో ఉన్న గణపురం అలాగే కొనసాగితే ములుగు జనరల్ అయ్యే అవకాశం ఉండేది. అదే విధంగా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలో ఉన్న కొత్తగూడను నర్సంపేట నియోజకవర్గంలో కొనసాగిస్తే నర్సంపేట సైతం ఎస్టీగా కొనసాగేది. అయితే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే పొదెం వీరయ్య అంతర్గతంగా సమావేశమై పరిస్థితిని తారుమారు చేశారు. రిజర్వేషన్లు మారకుండా నల్లబెల్లిని నర్సంపేటలో, కొత్తగూడను ములుగులో, గణపురం(ఎం)ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలిపారు. దీంతో ములుగు ముఖచిత్రం మారి ఎస్టీ రిజర్వ్ అయింది.



ములుగు నియోజకవర్గ కేంద్రం

నియోజకవర్గంలో పోటీ చేసిన వారి వివరాలు

సంవత్సరం	గెలుపొందిన పార్టీ	అభ్యర్థి	సమీప అభ్యర్థి	పోలైన ఓట్లు
1952	పీడీఎఫ్	హనుమంతరావు	రాజ్యలక్ష్మీ(కాంగ్రెస్)	23,869
1957	పీడీఎఫ్	రాజేశ్వర్‌రావు	కులు(కాంగ్రెస్)	28,865
1962	కాంగ్రెస్	కృష్ణయ్య	ప్రసాద్(సీపీఐ)	39,141
1967	ఇండిపెండెంట్	సంతోశ్ చక్రవర్తి	రామనర్సయ్య(సీపీఎం)	52,379
1972	కాంగ్రెస్	సంతోశ్ చక్రవర్తి	రావు(ఇండిపెండెంట్)	66,755
1978	కాంగ్రెస్	జగన్నాయక్	భోజరావు(జనతా)	64,320
1983	కాంగ్రెస్(ఐ)	జగన్నాయక్	అజ్మీర చందూలాల్(టీడీపీ)	64,474
1985	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	74,599
1989	కాంగ్రెస్	జగన్నాయక్	చందూలాల్(టీడీపీ)	1,02,475
1994	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	1,13,849
1996	టీడీపీ	భోజారావు	జగన్నాయక్(కాంగ్రెస్)	-
1999	కాంగ్రెస్	వీరయ్య	చందూలాల్(టీడీపీ)	1,15,227
2004	కాంగ్రెస్	వీరయ్య	సీతక్క(టీడీపీ)	1,18,383
2009	టీడీపీ	సీతక్క	పొదెం వీరయ్య(కాంగ్రెస్)	1,34,674
2014	బీఆర్ఎస్	చందూలాల్	సీతక్క(టీడీపీ)	-
2018	కాంగ్రెస్	సీతక్క	చందూలాల్(బీఆర్ఎస్)	1,68,780